సాక్షి మెదక్

గురువారం । 5 । సెప్టెంబర్ । 2024



గురుభ్యోనమః

అజ్ఞాన అంధకారాల నుంచి విజ్ఞాన, వికాసాల వైపు మనిషిని నడిపించే మహోన్నత వ్యక్తి గురువు.. మాతృదేవోభవ.. పితృదేవోభవ.. ఆచార్యదేవో భవ అన్నారు పెద్దలు. జీవితంలో తల్లిదండ్రుల తర్వాతి స్థానం గురువులదే. భవిష్యత్‌కు మార్గదర్శకులు. విద్యాబుద్ధులు నేర్పి.. సన్మార్గంలో నడిచేలా చేయడంలో వీరి పాత్ర కీలకం. తమ శిష్యులు ఉన్నతంగా ఎదగాలని కోరుకునే నిస్వార్థపరులు వారు. నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని ఆదర్శ ఉపాధ్యాయులపై ప్రత్యేక కథనాలు. 8లో ▸

డీన్‌కు రాష్ట్రస్థాయి అవార్డు



ములుగు(గజ్వేల్‌): ములుగు కొండాలక్ష్మణ్‌ ఉద్యాన విశ్వవిద్యాలయం డీన్‌, ప్రొఫెసర్‌ డాక్టర్‌ మర్రి రాజశేఖర్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. బోధన, పరిశోధన రంగంలో 26 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉంది. ప్రస్తుతం ఉద్యాన వర్సిటీ డీన్‌గానే కాకుండా పీజీ స్టడీస్‌, పీజీ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ హార్టికల్చర్‌ సైన్సెస్‌ ఇన్‌చార్జిగా, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలికి వర్సిటీ నుంచి నోడల్‌ ఆఫీసర్‌గా సేవలందిస్తున్నారు.

న్యూస్‌రీల్‌

'నష్టపోయిన రైతులను ఆదుకోండి'

పాపన్నపేట(మెదక్‌): ఇటీవల కురిసిన వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 25 వేల చొప్పు పరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్‌ నాయకుడు శశిధర్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో ఉమ్మడి మెదక్‌ జిల్లాలో వందలాది ఎకరాల పంటలకు నష్టం జరిగిందన్నారు. ఇటీవల అధికారులు సమగ్ర సర్వే నిర్వహించినట్లు చెబుతున్నప్పటికీ, కొన్ని గ్రామాల్లో అసలు సర్వే నిర్వహించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు అన్ని గ్రామాల్లో సర్వే నిర్వహించాలని డిమాండ్‌ చేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి: ఏబీవీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంత్‌

రామాయంపేట(మెదక్‌): విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్‌ ఆరోపించారు. బుధవారం రామాయంపేటలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పాలకులు మారినా విద్యార్థుల సమస్యలు పరిష్కారం కావడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ నిధులు విడుదల చేయడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల మంది నిరుపేద విద్యార్థులు ఉపకార వేతనాలపై ఆధారపడి చదువుకుంటున్నారని తెలిపారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు భాను, అర్జున్‌, దుర్గాప్రసాద్‌, స్వాతిక, జయంతి తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌ను చార్మినార్‌ జోన్‌లో కలపండి: టీఎన్జీఓ

మెదక్‌జోన్‌: ప్రజల ఆకాంక్ష మేరకు జిల్లాను రాజన్న జోన్‌ నుంచి చార్మినార్‌ జోన్‌లో కలపాలని టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌ మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. బుధవారం ఉద్యోగులతో కలిసి మంత్రికి వినతిపత్రం అందజేశారు. జిల్లాను రాజన్న జోన్‌లో చేర్చడం ద్వారా విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులకు జరిగే నష్టం గురించి వివరించారు. ముఖ్యంగా స్థానికత, స్థానికేతర సమస్యతో ఉద్యోగ నియామకాల్లో విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. అనంతరం కలెక్టర్‌ రాహుల్‌రాజ్‌ మంత్రికి జ్ఞాపికను అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో టీఎన్జీఓ జిల్లా ఉపాధ్యక్షుడు మహ్మద్‌ ఇక్బాల్‌ పాషా, ట్రెసా నాయకులు సిద్ధు, పరమేశ్వర్‌, నాగరాజు, తదితర ఉద్యోగులు ఉన్నారు.

'క్యూఆర్‌టీ' పనితీరు భేష్‌

మెదక్‌ మున్సిపాలిటీ: ఆపదలో ఉన్న వారి కోసం ప్రాణాలు తెగించి సేవలు అందించేవారే పోలీసులని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్‌ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని టేక్మాల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిగుండు వాగు వరదలో చిక్కుకున్న వారిని ప్రాణాలకు తెగించి కాపాడిన క్యూఆర్‌టీ బృందం సేవలు అభినందనీయమని కొనియాడారు. వరద బాధితులను కాపాడిన హోంగార్డు మహేష్‌తో పాటు క్యూఆర్‌టీ సభ్యులను డీజీపీ జితేందర్‌, ఏడీజీ మహేష్‌ భగవత్‌ అభినందించినట్లు తెలిపారు. రివార్డు అందుకున్న వారిని ఎస్పీ అభినందించారు.

మాకేందుకు మాఫీ కాలే..



కోనాపూర్‌ సొసైటీ ఎదుట రైతుల పడిగాపులు

రామాయంపేట(మెదక్‌): రామాయంపేట మండలం కోనాపూర్‌ సొసైటీ పరిధిలో రైతులకు రుణమాఫీ వర్తించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈమేరకు బుధవారం సొసైటీ వద్ద నిరసన తెలిపారు. కోనాపూర్‌ సహకార సంఘంలో మొత్తం 672 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. వీరిలో 412 మంది గతంలో పలు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారు. వీరిలో కేవలం 43 మందికి మాత్రమే రుణమాఫీ వర్తించింది. మిగితా 369 మందికి వర్తించకపోవడంతో మూడో విడత వరకు ఎదురుచూసి నిరాశ చెందారు. దీంతో పలు మార్లు వ్యవసాయ అధికారులతో పాటు బ్యాంకుల చుట్టూ తిరిగి వేసారి పోయి ఆందోళనకు దిగారు. ప్రాసెస్‌లో ఉందని, అర్హులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని సొసైటీ సీఈఓ మల్లారెడ్డి రైతులకు నచ్చచెప్పారు. ఇదే విషయమై సొసైటీ చైర్మన్‌ విజయలక్ష్మిని వివరణ కోరగా సొసైటీకి రావాల్సిన రూ. 2.26 కోట్లు ప్రభుత్వం జమ చేస్తే రైతులకు న్యాయం జరుగుతుందని చెప్పారు. స్టేట్‌ బ్యాంక్‌ అధికారుల వైఖరితోనే రైతులకు రుణమాఫీ వర్తించలేదని అన్నారు.

ఆ ఇద్దరి బోధనలు ఆదర్శం



మెదక్‌ కలెక్టరేట్‌: సోషల్‌ సబ్జెక్టు అంటే నాకు అస్సలు ఇష్టం ఉండేది కాదు. కాని అనిత మేడం చెప్పే పాఠాలు నన్నెంతో ప్రభావితం చేశాయి. పదో తరగతి వరకు హైదరాబాద్‌లోని సిద్ధార్థ స్కూల్‌లో చదువు సాగింది. 8వ తరగతి చదువుతున్న సమయంలో ఇంగ్లిష్‌ టీచర్‌ విలాసిని చదువులో ఎంతో ప్రోత్సహించేది. గొప్పవా డివి అవుతావని చెప్పేది. ఆమె ప్రోత్సాహంతో నాలో కాన్ఫిడెన్స్‌ పెరిగి ర్యాంకులు సాధించాను. అలాగే సోషల్‌ టీచర్‌ బోధన నన్నెంతగానో ప్రభావితం చేసింది. దీంతో సివిల్స్‌ వైపు వచ్చి కలెక్టర్‌ అయ్యా.

– కలెక్టర్‌ రాహుల్‌రాజ్‌

వారి ప్రోత్సాహం మరువలేనిది



మెదక్‌మున్సిపాలిటీ: గురువు అనుగ్రహం కలిగినవారు ఎవరైనా సరే జ్ఞానవంతులు అవుతారు. అజ్ఞానమనే చీకటిలో ఉన్న వారిని విజ్ఞానమనే దారిని చూపి జీవితాల్లో వెలుగు నింపేవారే ఉపాధ్యాయులు. నా చదువు అంతా సర్కారు బడిలోనే జరిగింది. ఖమ్మం జిల్లా రామచంద్రపురం మా సొంత గ్రామం. మా ఊరికి మూడు కిలోమీటర్ల దూరంలోని సుర్దేపల్లిలో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు చదివాను. నిత్యం 3 కిలోమీటర్లు నడిచి పాఠశాలకు వెళ్లేవాడిని. మా గురువులు నారాయణరెడ్డి, రంగారావు, శ్రీ రాములు నన్ను ఎంతో ప్రోత్సహించారు.

– ఎస్పీ ఉదయ్‌కుమార్‌ రెడ్డి

వెంకటరాజం సార్‌ స్ఫూర్తితో..



పాపన్నపేట(మెదక్‌): ఆది గురువు వెంకటరాజం నాకు ఆదర్శం. నా జీవన సాఫల్యంపై ఆయన చెరగని ముద్ర వేశారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో నా ప్రాథమిక విద్యాభ్యాసం కొనసాగింది. ఆరో క్లాస్‌లో ఇంగ్లిష్‌, సైన్స్‌ బోధించే వెంకటరాజం అంటే విద్యార్థులందరికీ అభిమానం. కేవలం పాఠ్యాంశ బోధనకే పరిమితం కాకుండా, తరగతి గదిలో ప్రపంచం చూ పేవారు. బెత్తం పట్టకుండా, ప్రేమతో చెప్పిన పాఠాలు జీవిత పాఠాలయ్యాయి. ఆయన ప్రభావంతో నేను టీ చర్‌ వృత్తిలోకి అడుగుపెట్టా. ఆయన మరణించినా మా జ్ఞాపకాల్లో జీవించే ఉన్నారు.

– డీఈఓ రాధాకిషన్‌

స్థానచలనం ఏదీ..?

- బదిలీ అయినా పాత పాఠశాలలోనే విధులు
- రిలీవ్‌ కాని 270 మంది ఉపాధ్యాయులు



నాపేరు నర్సింహాచారి. మాది రామాయంపేట మండలం కాట్రియాల. 11 ఏళ్లుగా పాపన్నపేట మండలం నామాపూర్‌ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాను. నిత్యం సుమారు వంద కిలో మీటర్ల ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఫలితంగా అనారోగ్య సమస్యలకు గురయ్యాను. గత జూన్‌లో విద్యాశాఖ ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టగా హవేళిఘనపూర్‌ మండలం నాగారం గ్రామానికి బదిలీ పెట్టుకున్నాను. బదిలీ చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు కూడా జారీ చేసింది. కాని విద్యాశాఖ అధికారులు రిలీవ్‌ చేయడం లేదు. నామాపూర్‌ పాఠశాలకు పెద్దశంకరంపేట నుంచి రావాల్సిన ఉపాధ్యాయుడు అక్కడ రిలీవ్‌ కాలేదు. దీంతో నేను తప్పనిసరి పరిస్థితుల్లో ఇక్కడే పనిచేయాల్సి వస్తోంది.

మెదక్‌ కలెక్టరేట్‌: జిల్లాలో 21 మండలాలు ఉండగా 897 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో విధులు నిర్వర్తిస్తున్న 1,076 మంది ఎస్జీటీ (సెకండరీ గ్రేడ్‌ టీచర్లు)లకు గత జూన్‌లో విద్యాశాఖ బదిలీలు నిర్వహించింది. బదిలీ ఉత్తర్వులు పొందిన 806 మంది రిలీవ్‌ కాగా, మరో 270 మంది ఉపాధ్యాయులు రిలీవ్‌ కాలేదు.

విద్యాశాఖ నిబంధనలు

విద్యాశాఖ నిబంధనల ప్రకారం ప్రతి 30 మంది విద్యార్థులకు ఒకరు, అంతకు మించి ఉంటే ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలి. అయితే జిల్లాలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఇదే క్రమంలో ఉపాధ్యాయుల బదిలీలు మరో సమస్యగా మారాయి. ఏకోపాధ్యాయుడు ఉన్న టీచర్లు బదిలీ అయినా మరో ఉపాధ్యాయుడు వచ్చే వరకు అక్కడే విధులు నిర్వర్తించాలి. లేదంటే ఉన్న ఒక్కరు బదిలీపై వెళితే పాఠశాల మూతపడే అవకాశం ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల నుంచి బదిలీలు పెట్టుకున్న వారికి రిలీవ్‌ ఇవ్వడం లేదు. ప్రభుత్వం వెంటనే కొత్త టీచర్లను నియమించి తమను రిలీవ్‌ చేయాలని బదిలీ అయిన టీచర్లు కోరుతున్నారు.



రిలీవ్‌ కానివారు..

జిల్లాలోని రిలీవ్‌ కాని ఉపాధ్యాయులు.. అల్లాదుర్గం 8, చేగుంట 9, చిలప్‌చెడ్‌ 5, హవేళిఘనాపూర్‌ 16, కౌడిపల్లి 22, కొల్చారం 17, మనోహరాబాద్‌ 12, మాసాయిపేట 6, మెదక్‌ 15, నర్సాపూర్‌ 14, నార్సింగి 10, నిజాంపేట 18, పాపన్నపేట 17, రామాయంపేట 19, రేగోడ్‌ 3, పెద్దశంకరంపేట 14, చిన్నశంకరంపేట 14, శివ్వంపేట 13, టేక్మాల్‌ 13, తూప్రాన్‌ 12, వెల్దుర్తి 13 చొప్పున మొత్తం 270 మంది ఉన్నారు.

నియామకాలు చేపట్టాలి



జిల్లాలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. ప్రభుత్వం స్పందించి వెంటనే డీఎస్సీ ఫలితాలు విడుదల చేసి కొత్త ఉపాధ్యాయులను నియమించాలి. కొన్ని పాఠశాలలు ఉపాధ్యాయుల కొరతతో మూతపడే పరిస్థితుల్లో ఉన్నాయి. ఈ విషయంలో తెలంగాణ విద్యాశాఖ తక్షణ చర్యలు చేపట్టాలి.

– జిద్ది ఎల్లం, తపస్‌ జిల్లా అధ్యక్షుడు

కొత్త వారు రావాల్సి ఉంది



జిల్లాలోని రేగోడ్‌, అల్లాదుర్గం, పెద్దశంకరంపేట మండలాల్లో టీచర్ల కొరత తీవ్రంగా ఉంది. అందువల్ల బదిలీలు పెట్టుకున్న ఉపాధ్యాయులను రిలీవ్‌ చేయలేకపోతున్నాం. ఇటీవల డీఎస్సీ అభ్యర్థులకు ఆన్‌లైన్‌ పరీక్షలు పూర్తయ్యాయి. ఫలితాలు రావాల్సి ఉంది. జిల్లాకు 150 మంది ఉపాధ్యాయులు కావాలని చెప్పాం.

– రాధాకిషన్‌, డీఈఓ, మెదక్‌



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

జిల్లాను అగ్రగామిగా నిలపాలి

- వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం

మెదక్‌జోన్‌: జిల్లాను అన్నిరంగాల్లో ప్రగతి పథంలో నిలపాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. భూ సమస్యల పరిష్కారానికి గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్యా, వైద్యం అందించి ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా ట్రామా, డయాలసిస్‌ కేంద్రాల ఏర్పాటు చేయాలని, నూతనంగా ఏర్పడిన మండలాల్లో పీహెచ్‌సీలను అందుబాటులోకి తేవాలన్నారు. సీజనల్‌ వ్యాధుల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాకు మెడికల్‌ కాలేజీ కోసం అభ్యర్థించామని, అది ప్రస్తుతం పరిశీలనలో ఉందన్నారు. అర్హులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని చెప్పారు. మెదక్‌ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలని, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా సౌకర్యాలు కల్పించి ప్రోత్సహించాలన్నారు. నర్సాపూర్‌ ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ.. నిరంతరం విద్యుత్‌ కొనసాగాలని, పెండింగ్‌ భవనాలు రోడ్లు పూర్తి చేయాలన్నారు. రుణమాఫీపై స్పష్టమైన విధానాన్ని రైతులకు వివరించాలని కోరారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో భూ సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కార దిశగా ప్రయత్నం చేయాలన్నారు. కలెక్టర్‌ రాహుల్‌రాజ్‌ మాట్లాడుతూ.. మంత్రి, ఎమ్మెల్యేలు, అధికారులు ఇచ్చిన సూచనలు తూచా తప్పకుండా పాటిస్తామని తెలిపారు. అదనపు కలెక్టర్‌ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో ధరణి పెండింగ్‌ కేసుల పరిష్కారం దిశగా రోజువారీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు.

గంగమ్మకు పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్‌): మండల కేంద్రమైన కౌడిపల్లి పెద్దచెరువు అలుగు పారుతుండడంతో బుధవారం మంత్రి దామోదర రాజనర్సింహ గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌ తదితరులు ఉన్నారు. చెరువు, కుంటలు నిండడంతో పంటలు బాగా పండుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

హరీశ్‌రావుపై దాడి దారుణం



సమావేశంలో మాట్లాడుతున్న పద్మ, చిత్రంలో ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి

బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షురాలు పద్మ

మెదక్‌ మున్సిపాలిటీ: ఖమ్మంలో మాజీ మంత్రి హరీశ్‌రావు బృందంపై కాంగ్రెస్‌ శ్రేణుల దాడి హేయమైన చర్య అని బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షురాలు పద్మ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్తే రాళ్ల దాడి చేయడం మంచి సంస్కృతి కాదన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ పిలుపు మేరకు బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేల ఒకరోజు వేతనాన్ని విరాళంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్‌ పార్టీ వరదలను కూడా రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. చర్యకు ప్రతి చర్య ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో బట్టిజగపతి, లావణ్యరెడ్డి, లింగారెడ్డి, జుబేర్‌ అహ్మద్‌, ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్‌ బాలగౌడ్‌ పాల్గొన్నారు.

హైడ్రాను స్వాగతిస్తాం

ఎంపీ రఘునందన్‌రావు

దుబ్బాక: సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రాను రాష్ట్ర మంతటా కాదు.. చంద్రమండలానికి విస్తరించినా బీజేపీ స్వాగతిస్తుందని మెదక్‌ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. బుధవారం పలు కేసులకు సంబంధించి పార్టీ కార్యకర్తలతో కలిసి దుబ్బాక కోర్టుకు హాజరయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. హైడ్రా వల్ల నష్టపోయిన గరీబోళ్లకు కోకాపేటలో వందల కోట్ల విలువజేసే భూములను ఇచ్చి ఇళ్లు కట్టించి ఇవ్వాలన్నారు. కోకాపేటలో పాత కలెక్టర్‌ వెంకట్రామిరెడ్డికి కోకాపేటలో 10 ఎకరాలు రిజిస్ట్రేషన్‌ కాలేదని ఆ భూములను తీసుకొని పేదోళ్లకు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. చెరువులు, కుంటల్లో ఇళ్లు కట్టుకోవడానికి అనుమతులు ఇచ్చిన అధికారులపైనా చట్టరీత్య చర్యలు తీసుకోవాలని అన్నారు.

బోధనలో ప్రత్యేకం.. సేవలో ఆదర్శం

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా కిషన్‌ ప్రసాద్‌



మెదక్‌జోన్‌/పాపన్నపేట: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా కిషన్‌ ప్రసాద్‌ ఎంపికయ్యారు. పాపన్నపేట మండలం చీకోడ్‌ లింగాయపల్లి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఆయన స్కూల్‌ అసిస్టెంట్‌ విభాగంలో పురస్కారం వరించింది. విద్యార్థులకు చక్కటి బోధనతో పాటు గురుకుల పాఠశాలలో చేరేందుకు ఎంట్రెన్స్‌, ఎంఎంఎస్‌ స్కాలర్‌షిప్‌ ఎంపిక కోసం ఉచిత కోచింగ్‌ ఇచ్చి ఆదర్శంగా నిలుస్తున్నారు. వేసవిలో సొంత డబ్బులు వెచ్చించి విద్యార్థులకు రాగిజావ (అంబలి) అందించి అందరి మన్ననలు పొందారు. మెదక్‌ జిల్లా హవేళిఘనాపూర్‌ మండలం నాగాపూర్‌ ప్రాథమికోన్నత పాఠశాలలో (ఎస్జీటీగా) కిషన్‌ ప్రసాద్‌ 11 ఏళ్లు ఇంగ్లిష్‌, గణితం బోధించారు. అందరు ఉపాధ్యాయులు పాఠశాల టైం ప్రకారం చదువు చెప్పి ఇళ్లకు వెళ్లిపోతే ఆయన మాత్రం సాయంత్రం 6.30 గంటల వరకు బోధించే వారని గ్రామస్తులు కొనియాడారు. విద్యార్థులను శాస్త్రవేత్తలుగా మార్చేందుకు ఎగ్జిబిట్‌, ఇన్నోవేషన్స్‌ తయారు చేయడానికి సొంత డబ్బులు వెచ్చించేవారని తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా జిల్లా నుంచి ముగ్గురి పేర్లు పంపగా ఒక్కరు మాత్రమే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారని డీఈఓ రాధాకిషన్‌ తెలిపారు.



వరద హోరు.. వేట జోరు

భారీ వర్షాలతో కొల్చారం మండలవ్యాప్తంగా చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. ఇదే సమయంలో చేపలు కొట్టుకువస్తుండడంతో వాటిని పట్టుకునేందుకు పెద్దఎత్తున జనం చెరువు వద్దకు చేరుతున్నారు. కొందరు దొరికిన చేపలను ఇంటికి తీసుకెళ్తుంటే, మరికొందరు అక్కడే విక్రయిస్తున్నారు. బుధవారం వరిగుంతం బ్రిడ్జి వద్ద జనం చేపలు పడుతుండగా 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

–కొల్చారం(నర్సాపూర్‌)

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

జిల్లాలో 53 మంది ఎంపిక



మెదక్‌ కలెక్టరేట్‌: జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా 53 మంది ఎంపికైనట్లు డీఈఓ రాధాకిషన్‌ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో వారిని సన్మానించనున్నట్లు చెప్పారు. శ్రీనివాస్‌, జెడ్పీహెచ్‌ఎస్‌ కొనపూర్‌ (రామాయంపేట), గోపాల్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ బాయ్స్‌, శ్రీనివాస్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ కాట్రియల్‌, గణ్యా ఎంపీపీఎస్‌ అక్కన్నపేట, సాయిరెడ్డి జెడ్పీహెచ్‌ఎస్‌ సూరారం (చిన్నశంకరంపేట), బాల్‌రాజ్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ (చిన్నశంకరంపేట), సంతోష్‌కుమార్‌ ఎంపీపీఎస్‌ (చందంపేట), దుర్గరాములు ఎంపీయూపీఎస్‌ గవ్వలపల్లి, చంద్రప్రకాశ్‌ ఎంపీపీఎస్‌ బాలికలు (పెద్దశంకరంపేట), శేఖర్‌గౌడ్‌ ఎంపీయూపీఎస్‌ మల్కాపూర్‌, మహిపాల్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ పొడ్చన్‌పల్లి (పాపన్నపేట), నిశాంత్‌కుమార్‌ టీజీఎంఎస్‌ (రేగోడ్‌), మంజుల కేజీబీవీ (శివ్వంపేట), స్వరూపరాణి కేజీబీవీ గూడూర్‌, తీగల నాగరాజు జెడ్పీహెచ్‌ఎస్‌ గోమారం, రాజశేఖర్‌రెడ్డి జెడ్పీహెచ్‌ఎస్‌, చిన్నగొట్టిముక్క, బొజ్జ చంద్రశేఖర్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ గోమారం, నర్సాగౌడ్‌ ఎంపీపీఎస్‌ చెన్నాపూర్‌, సౌజన్య ఎంపీపీఎంఎస్‌ గోమారం, పర్వీన్‌ ఎంపీపీఎస్‌ గోమారం, శ్రీవాణి ఎంపీపీఎంఎస్‌ రత్నాపూర్‌, అర్చన జెడ్పీహెచ్‌ఎస్‌ వెల్దుర్తి, రావుల వెంకటేశ్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ చేగుంట, షేక్‌ సలీం జెడ్పీహెచ్‌ఎస్‌ చందాయిపేట (చేగుంట), మనోహర్‌ జెడ్పీహెచ్‌ఎస్‌, చేగుంట, దేశపతి కృష్ణమూర్తి జెడ్పీహెచ్‌ఎస్‌ రెడ్డిపల్లి, కంచర్ల అజిత జెడ్పీహెచ్‌ఎస్‌ చందాయిపేట, సత్యనారాయణ ఎంపీపీఎస్‌ కర్నాల్‌పల్లి, నంగీత ఎంపీపీఎస్‌ కసాన్‌పల్లి, కిష్టయ్య జెడ్పీహెచ్‌ఎస్‌ ఘణాపూర్‌ (తూప్రాన్‌), రతన్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ వెంకటాయపల్లి, యాదగిరి ఎంపీ యూపీఎస్‌ రావెల్లి, కిశోర్‌కుమార్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ చిన్న చింతకుంట (నర్సాపూర్‌), నరేందర్‌రావు జెడ్పీహెచ్‌ఎస్‌ మాసాయిపేట, శ్రీదేవి జెడ్పీహెచ్‌ఎస్‌ మనోహరాబాద్‌, శిరీష ఎంపీపీఎస్‌ కొండాపూర్‌, కళ్యాణి ఎంపీపీఎస్‌ ముప్పిరెడ్డిపల్లి, మాలతి ఎంపీపీఎస్‌ కూచారం, రమేష్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ ఎలకుర్తి (టేక్మాల్‌), రజని జీజీహెచ్‌ఎస్‌ మెదక్‌, సత్యనారాయణ, జెడ్పీహెచ్‌ఎస్‌ మాచవరం, చంద్రశేఖర్‌ ఎంపీపీఎస్‌ పెద్దబాయితండా (మెదక్‌), అంజమ్మ జీపీఎస్‌ జంబికుంట, ఆంజనేయులు జెడ్పీహెచ్‌ఎస్‌ ముస్లాపూర్‌ (అల్లాదుర్గం), దేవిసింగ్‌ జెడ్పీహెచ్‌ఎస్‌ బూర్గుపల్లి (హవేళిఘణాపూర్‌), సంగమేశ్వర్‌ ఎంపీపీఎస్‌ చౌట్లపల్లి, ఎల్లయ్య ఎంపీపీఎస్‌ నస్కల్‌ (నిజాంపేట), స్వప్న ఎంపీయూపీఎస్‌ వెంకటాపూర్‌, నారాయణ ఎంపీయూపీఎస్‌ అప్పాజిపల్లి (కొల్చారం), ఏగొండ ఎంపీపీఎస్‌ వెంకటాపూర్‌, ప్రవీణ్‌కుమార్‌ ఎంపీపీఎస్‌ ముత్తాయిపల్లి తండా (కౌడిపల్లి), పాల శ్రీనివాస్‌ ఎంపీపీఎస్‌ రుస్తుంపేట (నర్సాపూర్‌), వేల్పులరాజు ఎంపీపీఎస్‌ భీంరావుపల్లి (నార్సింగి) ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

క్లుప్తంగా

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

హవేళిఘణాపూర్(మెదక్): చేపలు పట్టేందుకు వెళ్లిన మత్స్యకారుడు మృతి చెందిన ఘటన హవేళిఘణాపూర్ మండలం ఫరీద్‌పూర్ చెక్ డ్యామ్ శివారులో బుధవారం చోటు చేసుకుంది. మెదక్ పట్టణం సుభాశ్ కాలనీకి చెందిన కొత్తోల్ల మల్లేశ్(51), కుమారుడు కొత్తోల్ల సందీప్ ఇద్దరూ బుధవారం ఉదయం హవేళిఘణాపూర్ మండల పరిధిలోని ఫరీద్‌పూర్ చెక్ డ్యామ్ వద్ద చేపలు పట్టేందుకు వెళ్లారు. పట్టిన చేపలను మధ్యాహ్నం విక్రయించేందుకు కుమారుడు మెదక్‌కు వచ్చాడు. చేపలు పడుతున్న మల్లేశ్ కాలుజారి నీటిలో పడిపోయి చనిపోయాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కౌడిపల్లిలో వ్యక్తి గల్లంతు

కౌడిపల్లి(నర్సాపూర్): చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి గల్లంతయ్యాడు. బుధవారం ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన కౌడిపల్లి పంచాయతీ పరిధిలోని బతుకమ్మతండాకు చెందిన మెగావత్ సురేశ్(35) మంగళవారం మధ్యాహ్నం కౌడిపల్లి పెద్దచెరువులో చేపలు పట్టేందుకు ఇంటి నుంచి వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తండాలో వెతికినా ఆచూకీ లభించలేదు. పెద్దచెరువు శిఖం భూమి నీటిలో చేపలు పట్టేందుకుగాను స్థానిక నర్సరీ వద్ద బైక్ పెట్టి వెళ్లినట్లు అక్కడ పని చేసే కూలీలు చెప్పారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు తండావాసులతోపాటు పోలీసులు, ఫైర్ అధికారులు గాలించినా దొరకలేదు. గురువారం వెతుకుతామని పోలీసులు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెద్దశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ శంకర్ కథనం మేరకు.. మాడ్చెట్‌పల్లి గ్రామానికి చెందిన కాయిత రమేశ్(40) మండల కేంద్రం నుంచి స్వగ్రామానికి బైక్ వెళ్తున్నాడు. పెద్దశంకరంపేట మండలం ఉత్తులూర్ గ్రామ శివారులోకి రాగానే ప్రమాదవశాత్తు బైక్ పై నుంచి కింద పడడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

తేలు కాటుకు మహిళ..

మద్దూరు(హుస్నాబాద్): తేలు కాటుకు ఓ మహిళా కూలీ మృతి చెందారు. ఎస్‌ఐ షేక్ మహబూబ్ కథనం మేరకు.. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని కొండవటూరు గ్రామానికి చెందిన దండుగుల లావణ్య(26) మంగళవారం ఉదయం మండలంలోని సలాఖపూర్ గ్రామానికి చెందిన కామిడి జీవన్ రెడ్డి కంది చేనులో కలుపు తీసేందుకు వెళ్లింది. చేనులో కలుపు తీస్తున్న క్రమంలో తేలు కుట్టింది. రైతు జీవన్‌రెడ్డి ఆమెను మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలి భర్త మహిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో చోరీ



జహీరాబాద్: మండల కేంద్రమైన కోహీర్ పట్టణంలోని రెండు ఫర్టిలైజర్ దుకాణాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. మంగళవారం రాత్రి పోలీసు స్టేషన్ సమీపంలో ప్రధాన రహదారిపై ఉన్న జీ.విక్రంరెడ్డి ఫర్టిలైజర్, గ్రోమోర్ కంపెనీ ఫర్టిలైజర్ షటర్లను తొలగించి విక్రంరెడ్డి దుకాణంలో రూ.16 వేల నగదును దొంగిలించారు. గ్రోమోర్ దుకాణం కౌంటర్ లాకర్ తెరుచుకోకపోవడంతో వెనుదిరిగి వెళ్లినట్లు పోలీసులు పేర్కొన్నారు. నిందితులు సీసీ కెమెరాకు చిక్కారు. కోహీర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

బడి 'స్వరూప'ం మార్చారు



స్వరూప

రేగోడ్(మెదక్): ఓ ప్రభుత్వ మహిళా ఉపాధ్యాయురాలు రోజూ నాలుగు కిలో మీటర్లు నడిచి పాఠశాలకు వెళ్తోంది. రేగోడ్ మండలం చౌదర్‌పల్లి గ్రామ పంచాయతీలోని హేమ్లానాయక్ తండాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉంది. ఇక్కడ రెండు గదులు ఉండగా ఒకటి శిథిలావస్థలో ఉంది. తండాలో ఉన్న ఎనిమిది మంది విద్యార్థులు బడిలో చదువుకుంటున్నారు. 317 జీఓలో చౌదర్‌పల్లి పాఠశాలకు ఉపధ్యాయురాలు స్వరూప రెండేళ్ల కిందట వచ్చారు. రేగోడ్‌లో ఉంటూ రోజూ నాలుగు కిలోమీటర్లు నడిచి హేమ్లానాయక్ తండా పాఠశాలకు వెళ్తోంది. ఇబ్బందులు ఉంటే డిప్యూటేషన్‌పై వెళ్లే ఉపాధ్యాయులు ఉన్నారు. కానీ ఈ ఉపాధ్యాయురాలు స్వరూప మాత్రం ఇబ్బందులు ఎదురైనా బడిని నిలబెట్టింది.

ఆల్ రౌండర్‌గా అంజాగౌడ్



సబితారెడ్డి చేతుల మీదుగా అందుకుంటున్న అంజాగౌడ్ (ఫైల్)

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట ఉన్నత పాఠశాలలోని తెలుగు పండిత్ అంజాగౌడ్ ఆల్ రౌండర్‌గా అందరి మన్ననలు అందుకుంటున్నాడు. కొరియోగ్రాఫర్ కావాలనుకొని ఉపాధ్యాయుడు అయ్యాడు. 2006 డీఎస్సీ టాపర్‌గా ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగు పెట్టిన ఆయన ఉపన్యాస, వ్యాసరచన, క్విజ్, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీశారు. కుర్తివాడ విద్యార్థులు జిల్లా స్థాయి డ్రామా పోటీల్లో ప్రథమ స్థానం, రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం పొందేలా తీర్చి దిద్దాడు.అక్కడ ఆయన ఇన్‌చార్జి హెచ్ఎంగా పనిచేసిన మూడేళ్లు పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించారు. 2021లో రాష్ట్ర స్థాయి ఉత్తమ వార్డును అందుకున్నారు. ఎస్సీఆర్టీ డైరెక్టర్ గాజర్ల రమేశ్ రాసిన 'ఓడి పోనీయకు నీ ఓటును' అనే పాటకు విద్యార్థుల చేత నృత్యాన్ని చేయించి ఓటు హక్కు విలువను చాటి రాష్ట్ర వ్యాప్త కీర్తిని మూట గట్టుకున్నారు.

మాధవి.. బోధనలో కొత్త ఒరవడి



దుబ్బాక : దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు వీ.మాధవి వినూత్న రీతిలో విద్యార్థులకు బోధించడంపై రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు చాటారు. బోధనోపకరణాల్లో కొత్త ఒరవడిని తీసుకొచ్చిన ఉపాధ్యాయురాలు మాధవి ప్రతిభను గుర్తించిన రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ(ఎస్ఈఆర్టీ) ఆమె సక్సెస్ స్టోరీని ఇటీవలె హార్బింజర్స్ ఆఫ్ చేంజ్ పుస్తకంలో ప్రచురించడం విశేషం. ఇప్పటికే పలు పర్యాయాలు ఆమె రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డులు అందుకున్నారు. విద్యా వ్యవస్థల్లో ప్రస్తుత సమాజానికి అనుగుణంగా మార్పులు తీసుకురావాలన్నదే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు మాధవి చెప్పారు.

నిత్య విద్యార్థి.. ఈ ఉపాధ్యాయుడు



సైన్స్ దినోత్సవంలో రవివర్మ

కోహెడరూరల్(హుస్నాబాద్) : మండలంలోని వింజపల్లి గ్రామ పరిధిలోని పెరుకల గడ్డ ప్రధానోపాధ్యాయుడు రవివర్మ వినూత్న బోధన చేపడుతూ ఆదర్శ నిలుస్తున్నాడు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో సబ్జెక్టుకు దగ్గ యూనిఫామ్ వేసుకొని బోధన చేపడుతూ విద్యార్థుల్లో ఒకడిగా కలసిపోయి పాఠాలు చెబుతున్నాడు. విద్యార్థులు ప్రవేట్ పాఠశాలకు వెళ్లకుండా విద్యనిందస్తాం... వినుడి మా మాట అంటూ సైకిల్‌కి ఫ్లెక్సీలు కట్టుకొని మైక్ ద్వారా ప్రచారం చేశారు. వేసవిలో శిక్షణ తరగతులు ఇచ్చి చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, ఇంగ్లిష్ స్పీకింగ్‌లో శిక్షణ ఇచ్చారు.

శభాష్.. బాలశేఖర్ సార్



గోడలపై బొమ్మలు వేస్తున్న బాలశేఖర్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కంచన్‌పల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బాలశేఖర్ 2013లో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరారు. గ్రామస్తులతో మమేకమై ప్రైవేట్‌కు దీటుగా పాఠశాలలో విద్యార్థులు బోధన చేస్తున్నారు. పాఠశాల గోడలపై సొంత ఖర్చులతో బొమ్మలు వేయడం, చెమస్, ఇతర అందమైన మొక్కలు పెంపకం, యోగా నేర్పిస్తున్నాడు. జాతీయ దినోత్సవాలు, పండుగల్లో ప్రత్యేకంగా విద్యార్థులతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు. దీంతో మండల, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు పొందాడు.

సేవా గురువు



సేవా పురస్కారం తీసుకుంటున్న శ్రీనివాస్ (ఫైల్)


బెజ్జంకి(సిద్దిపేట): ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూనే మండలంలో విద్య, సామాజిక కార్యక్రమాలను చురుగ్గా నిర్వహిస్తూ ప్రజల మన్నన పొందుతున్నాడు వడ్లకొండ శ్రీనివాస్. మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ బెజ్జంకి క్రాసింగ్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నాడు. బడీడు పిల్లలను బడిలో చేర్పించడం, హరితహారం, వాహనదారులకు హెల్మెట్ వినియోగం, ప్లాస్టిక్ కవర్ల నిషేధం తదితర కార్యక్రమాలపై ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇటీవల సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవా పురస్కారం పొందాడు.

గణిత బోధనలో అపు'రూప'ం



రూపారాణి

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని సిర్సనగండ్ల హైస్కూల్లో గణిత ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న రూపారాణి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆమె మాటల్లో.. గణితం అంటేనే సహజంగా విద్యార్థులు భయాందోళనకు గురవుతుంటారు. అలాంటి భయాన్ని పోగొట్టేలా గణిత బోధన చేసేటప్పుడు విద్యార్థులు అలసటగా ఉండకుండా ఆట, పాటలతో పాటు వినూత్న రీతిలో బోధనలు చేస్తూ ఆకర్శితులయ్యేలా చేస్తున్నాను. కొత్త కొత్త మెథడ్స్ రూపంలో బోధిస్తూజాతీయ, రాష్ట్ర స్థాయిల్లో అవార్డును పొందాను. ఇప్పటి వరకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో అవార్డులు పొందిన ఏకైక మహిళా గణిత ఉపాధ్యాయురాలిని నేనే కావడం సంతోషంగా ఉంది.



గురువు.. మూడు అక్షరాలే అయినా తరాలను మార్చే నైపుణ్యం వారి సొంతం. ఉపాధ్యాయుడు చూపిన మార్గంలో నడిచిన విద్యార్థి తన జీవితంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించడం ఖాయం. పుస్తక పాఠ్యాంశాలతో పాటు తమ జీవిత అనుభవాలను వివరిస్తూ.. ప్రోత్సాహం అందిస్తూ శిష్యుల భవితను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులది కీలకపాత్ర. వినూత్న రీతిలో బోధిస్తూ విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందిస్తారు. నూతన పద్ధతులు, ప్రయోగాల ద్వారా వివరిస్తూ పిల్లలు మంచి ఫలితాలు సాధించేలా కృషి చేస్తారు. నేడు డా.సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులపై ప్రత్యేక కథనం..

నేడు ఉపాధ్యాయ దినోత్సవం

గురుభ్యోనమః

- ప్రోత్సహిస్తారు.. ఉన్నతంగా తీర్చిదిద్దుతారు
- విద్యార్థులకు ఉపాధ్యాయులే మార్గదర్శకులు
- ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి
- సొంత ఖర్చులతో పుస్తకాలు
- సామాజిక సేవల్లోనూ భాగస్వాములవుతూ..



వైయస్ రాజశేఖర్‌రెడ్డితో పురస్కారం అందుకుంటున్న మాణయ్య (ఫైల్)

సమాజ సేవలో తరిస్తూ..

జోగిపేట(అందోల్) : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే కాకుండా, సమాజ సేవలో భాగంగా వైద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, పల్స్ పోలియో, ప్లాస్టిక్ వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాడు జోగిపేట బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడు ఆకుల మాణయ్య. సామాజిక కార్యక్రమాలు చేపడుతూ మంచి గుర్తింపును సంపాదించారు. విద్యార్థుల్లో మానవతా విలువలు, సామాజిక స్పృహను పెంపొందించేందుకు కృషి చేసినందున 2005లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తించారు. అప్పట్లో వైయస్ రాజశేఖర్‌రెడ్డి చేతులమీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు

తేనెలొలుకే వసుంధర దేవి



చిన్నశంకరంపేట(మెదక్): తేనెలొలుకు తెలుగు పదాలతో విద్యార్థులకు తెలుగు బోధన చేస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు చిన్నశంకరంపేట జెడ్పీ పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు వసుంధర దేవి. పదేళ్ల కిందటే ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉత్తమ ఉపాధ్యయురాలుగా అవార్డును పొందారు. బోధనతోపాటు పాఠశాలలో జరిగే కార్యక్రమాల్లో ఉపన్యాసకురాలిగా, యాంకర్‌గా గుర్తింపు పొందారు.

తెలుగు భాషకు జీవం



సత్కారం పొందుతున్న అరుణాదేవి

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం గాంధీనగర్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తాడూరి అరుణాదేవి విద్యా బోధన చేస్తూనే పద్య శతకాలు రచయించి తెలుగు భాషాకు జీవం పోశారు. 2008 నవంబర్‌లో ఉద్యోగం పొందిన అరుణాదేవి జగిత్యాల జిల్లా మెట్‌పెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొదటిసారి విధుల్లో చేరారు. 2022 జనవరిలో జిల్లెలగడ్డ పాఠశాలకు వచ్చిన ఆమె పాఠశాల విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాలను అందించారు. జూన్ 6 తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది గాంధీనగర్ పాఠశాలకు ప్రధానోపాధ్యాయురాలుగా వచ్చారు. విద్యార్థులకు బోధన చేస్తూనే తెలుగు భాషపై అభిరుచితో 'అరుణ శతకం' పేరున పుస్తకము రాసి 500 శతక పుస్తకాలను ముద్రించింది. పద్య సాహిత్య పీఠం తెలంగాణ సాహిత్య సేవా ట్రస్టు వారు దాశరథి, కాళోజీ శత జయంతీల సందర్భంగా అరుణాదేవిని ప్రశంసాపత్రంతో సత్కరించారు.

శ్రీనివాస్ నిత్య'కృత్యం'



జంతువులపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

వర్గల్(గజ్వేల్): ఆడుతూ పాడుతూ చదువుతూ ఉంటే అలుపూ సొలుపేముంటది.. అలనాటి ఓ సినీ గీతం వర్గల్ మండలం మైలారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు దేవగణిక శ్రీనివాస్ బోధన తీరుకు అతికినట్లుంటుంది. కృత్యమే నిత్యకృత్యంగా ఆడిస్తూ, పాడిస్తూ పాఠాలు చెప్పే ఆ టీచర్ అంటే విద్యార్థులకు ఎంతో అభిమానం. తానే స్వయంగా రూపకల్పన చేసిన 'పుష్పంలో దాగే పదాలు' (వర్డ్స్ ఇన్ ద ఫ్లవర్) అనే కృత్యం 2020లో కేంద్ర ప్రభుత్వ జాతీయ స్థాయి అవార్డును బొమ్మలు ప్రదర్శిస్తూ ఆట, పాటల్లో విద్యార్థులను మమేకం చేస్తే బడి అంటే భయం తొలగి క్రియేటివిటీ అలవడుతుంది.

ముగ్గురు జిల్లా 'ఉత్తమ' టీచర్లు



సావిత్రి



సీహెచ్ సుమన్



కే. కరుణశ్రీ

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వర్గల్ మండలం నుంచి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ముగ్గురు ఎంపికయ్యారు. నెంటూరు జెడ్పీ హైస్కూల్ టీచర్ జే. సావిత్రి, చాంద్‌ఖాన్ మక్త స్కూల్ టీచర్ సీహెచ్. సుమన్, సీతారాంపల్లి తండా స్కూల్ టీచర్ కే.కరుణశ్రీకి ఈ అవార్డులు వరించాయి. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈ పురస్కారం అందుకోనున్నారు.

ఉపాధ్యాయులు సేవా సారథులు



పాఠాలు బోధిస్తున్న చంద్రయ్య

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ పొందినప్పటికీ నేటికీ విద్యార్థుల కోసం పాఠాలు బోధిస్తూ ఇతర ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు చంద్రయ్య సార్.. వివరాల్లోకి వెళ్తే.. మునిపల్లి మండలంలోని అంతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2018లో బదిలీపై ఇక్కడికి వచ్చాడు. ఆరేళ్లుగా ఇక్కడే బోధిస్తూ ఇటీవలె జూన్‌లో ఉద్యోగ విరమణ పొందాడు. విరమణ పొందిన అనంతరం ఇప్పటివరకు ఆ స్థానం భర్తీ కాలేదు. పదవ తరగతి విద్యార్థులకు నష్టం కాకూడదనే ఉద్దేశ్యంతో తన గ్రామం నుంచి రోజు 18 కిలోమీటర్లు బైక్‌పై ప్రయాణం చేస్తూ మూడు నెలలుగా సాంఘీక శాస్త్రాన్ని బోధిస్తున్నాడు.

పాఠశాల రూపు మార్చేశాడు



జగదీశ్వర్

అది ఓ శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం, విద్యార్థులు కూడా అంతంతే.. పాఠశాలకు విద్యార్థులను పంపించాలంటే తల్లిదండ్రులే భయపడే పరిస్థితి.. ఇది ఒకప్పటి మొగుడంపల్లి మండలంలోని అసద్‌గంజ్ ప్రాథమిక ఉన్నత పాఠశాల దుస్థితి. 2015లో ఆ పాఠశాలకు జగదీశ్వర్ ప్రధానోపాధ్యాయుడిగా విధుల్లో చేరారు. పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించాచి అభివృద్ధి చేయాలనేదే లక్ష్యం. మహీంద్రా పరిశ్రమలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్న తన స్నేహితుడి వద్దకు పాఠశాల పరిస్థితి తీసుకెళ్లాడు. పరిశ్రమ వారు రూ.15 లక్షలు వెచ్చించి ఆ పాఠశాలలో పెయింటింగ్, విద్యార్థులకు డెస్కులు, మైనర్ రిపేర్లు వంటివి చేయించి పాఠశాలకే వన్నె తీసుకొచ్చారు. 2015లో 70 మంది ఉండగా 2023లో 130కి పెరిగింది. జగదీశ్వర్ చేసిన సేవలకు గానూ సబితా ఇంద్రారెడ్డి చేతులమీదుగా రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు.

వ్యక్తిత్వ వికాస తరగతులు..



పూర్ణ కృష్ణ

పదవ తరగతి విద్యార్థులను ఫైనల్ పరీక్షలకు అన్ని విధాలుగా సంసిద్ధం చేసేందుకు ఐదేళ్లుగా 150కి పైగా పాఠశాలలో వ్యక్తిత్వ వికాస తరగతులను నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు తెలుగు భాషోపాధ్యాయుడు పూర్ణ కృష్ణ. సదాశివపేట మండలం వెల్టూర్‌లో తెలుగు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఎక్కడ ఏ ప్రభుత్వ కార్యక్రమం జరిగినా పూర్ణ కృష్ణ వాఖ్యాతగా వ్యవహరించాల్సిందే. ఇదే కాకుండా విద్యార్థులకు అందమైన చేతిరాత, సాహిత్యంలో భాషా క్రీడలు పద్యాపఠన పోటీలు వంటి వాటిని నిర్వహించి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కృషి చేస్తున్నాడు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రస్థాయి అవార్డు ఇచ్చి సత్కరించింది.

కొత్తగా చేరే పిల్లలతో అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న దేవిసింగ్ రాథోడ్

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని రాయిపల్లి తండా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవిసింగ్ రాథోడ్ తన కృషితో తండా బడిని తీర్చిద్దారు. 2015 సంవత్సరంలో హెచ్ఎంగా బాధ్యతలను స్వీకరించినప్పుడు 63 విద్యార్థులు ఉండగా ప్రస్తుతం స్కూల్‌లో 123 మంది ఉన్నారు. సొంత ఖర్చులతో డిజిటల్ క్లాస్‌ను ఏర్పాటు చేసి పాఠాలను బోధిస్తున్నారు. ప్రతీ తరగతిలో బెంచీలు, గోడలపై అందమైన బొమ్మలు వేయించి ఆకర్షణీయంగా చేశారు. ప్రతీ సంవత్సరం జాయింగ్ పిల్లలతో అక్షరాభ్యాసం ఇతర కార్యక్రమాలను కూడా చేస్తున్నారు. పలుమార్లు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో కూడా బెస్ట్ టీచర్ అవార్డు తీసుకున్నారు.

గాయత్రీ.. బోధనలో సరస్వతీ



గాయత్రీ

గజ్వేల్‌రూరల్: గజ్వేల్‌కు చెందిన ఎలగందుల గాయత్రీ ఎంఏ బీఎడ్ పూర్తి 2003లో చేగుంట మండలం పొలంపల్లిలో ఉపాధ్యాయురాలిగా విధుల్లో చేరారు. బదిలీపై 2012లో గుండన్నపల్లిలోని ప్రాథమిక పాఠశాలకు వచ్చి ఏకోపాధ్యాయురాలిగా విద్యాబోధన చేశారు. ఇక్కడకు వచ్చిన మొదట్లో 10 మంది విద్యార్థులుండగా చిన్న గ్రామమైనప్పటికీ విద్యార్థుల సంఖ్యను 38 వరకు చేర్చడంలో తీవ్రంగా కృషి చేశారు. అంతేగాకుండా గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల ఆశాజ్యోతి ఎయిడ్స్ కేర్ సెంటర్‌లో ఆశ్రయం పొందుతున్న అనాథ చిన్నారులకు సైతం విద్యాబోధన చేసి అందరి మన్ననలు పొందారు. పన్నెండేళ్లుగా విద్యార్థులకు పాఠాలను చెబుతూ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తూ వచ్చిన గాయత్రీ ఊరు మెచ్చిన ఉపాధ్యాయురాలిగా నిలిచారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీ(సింగారం)లోగల ఎంపీయూపీఎస్–2కు వచ్చారు.

ఆదర్శం.. ఆ ప్రధానోపాధ్యాయుడు



అవార్డు అందుకుంటున్న రామకృష్ణ (ఫైల్)

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): సదాశివపేట మండల పరిధిలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న పోట్రు రామకృష్ణ విధి నిర్వహణలో అంకిత భావంతో ఉంటారని పేరున్నది. వినూత్న ఆలోచనలతో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారు. ఈయన సేవలను గుర్తించిన ప్రభుత్వం 2019లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందజేసింది. సామాజిక సేవలో భాగంగా ఇప్పటికే 21 సార్లు రక్తదానం చేయడం, మొక్కలను నాటి సంరక్షించడం, విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, ఇతర వస్తువులు అందజేస్తారు. సీఎం సహాయనిధికి విరాళాలు సైతం అందజేస్తున్నారు. విద్యారంగంలో 25 ఏళ్లుగా చేసిన సేవలకు గాను అమెరికన్ సౌత్ వెస్టర్న్ యూనివర్సిటీ 2022లో గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. జాతీయ గురుబ్రహ్మ పురస్కారానికి ఎంపికయ్యారు. సెప్టెంబర్ 8న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును అందుకోనున్నారు.

వృత్తి బోధన.. ప్రవృత్తి సేవ



వీల్ చైర్లు అందజేస్తున్న చంద్రశేఖర్

నారాయణఖేడ్: విద్యాబోధనలో తనదైన మార్కును ప్రదర్శిస్తూనే సామాజిక సేవా కార్యక్రమాలతో జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తున్నాడు నారాయణఖేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు వోతె చంద్రశేఖర్. వివిధ విభాగాల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో అవార్డులు అందుకుంటూ నేడు ఉపాధ్యాయయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుల కోవలో నిలుస్తున్నాడు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివేది పేద పిల్లలు కావడంతో వారికి సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నాడు. 2008లో నల్లవాగు పాఠశాలలో అధ్యాపకుడిగా ఉంటూ 150 మందికి, 2009లో గోసాయిపల్లిలో 120 మందికి, కల్హేర్ మండలంలో 9 ప్రభుత్వ పాఠశాలల్లోని 300 మంది విద్యార్థులకు రెండు జతల బట్టలు వితరణ చేశారు. 2010 నుంచి ప్రతీయేడు 100 మందికి పైగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద పిల్లలకు యూత్‌ఫర్ సేవ– పేవోద్ధం ఫౌండేషన్, డిగ్నిటీ డ్రైవ్ తదితర సంస్థల సహకారంతో బ్యాగులు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. 10 ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ల బహూకరణ, 20 మంది దివ్యాంగ విద్యార్థులకు వీల్‌చైర్ల అందజేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సీడ్ బాల్స్ అడవుల్లో వేయించి అటవీ విస్తీర్ణం పెంపునకు కృషి. ర్యాకల్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ వాటర్ ఫిల్టర్, క్రీడా సామగ్రి, నోట్‌బుక్స్, బ్యాగుల వితరణ చేశారు. 2019లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2024లో ప్రస్తుత రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ గారి చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ రక్తదాత అవార్డు అందుకున్నారు.

ఊరు మెచ్చిన ఉపాధ్యాయుడు



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న క్రీడాకారులు

వట్‌పల్లి (అందోల్): క్రీడలంటే అతడికి ప్రాణం, పోలీసు ఉద్యోగాన్ని వదులుకొని పీఈటీగా చేరారు వీబీ శ్రీనివాస్. పీఈటీగా 12 ఏళ్లుగా పనిచేస్తున్నారు. అందోలు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో చేరిన తర్వాత 32 మంది క్రీడాకారులను జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. వీరే ఇటీవల జరిగిన కానిస్టేబుల్ సెలక్షన్స్‌లో 10 మంది ఎంపికై శిక్షణ పొందడం విశేషంగా చెప్పుకోవచ్చు. ఆయన శిష్యులే ఇద్దరు అగ్నివీర్‌కు ఎంపికయ్యారు. అందోలు పాఠశాల నుంచి ఫిజికల్ డైరెక్టర్‌గా పదోన్నతిపై జోగిపేట పాఠశాలకు ఇటీవలె బదిలీ అయ్యారు.

పనిచేసే పాఠశాలలో తన పిల్లలు



పిల్లలతో లక్ష్మణ్‌చారి

జగదేవ్‌పూర్(గజ్వేల్): తాను ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న పాఠశాలలోనే తన పిల్లలను చేర్పించి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌చారి. కుకునూర్‌పల్లి మండలం పీటీ వెంకటాపూర్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న లక్ష్మణ్‌చారి తన ఇద్దరు పిల్లలు ప్రజ్ఞారాయల్ 5వ తరగతి, జ్ఞాన్‌రాయల్ 4వ తరగతి ఆదే పాఠశాలలో చేర్పించి తోటి విద్యార్థుల తల్లిదండ్రులకు ఆదర్శంగా నిలిచారు.